www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

ఆదమరిస్తే అంతే...

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాత బస్టాండ్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నడి రోడ్డులో మ్యాన్ హోల్ గుంత పైకప్పు లేకుండా ఉండడంతో వాహనదారులు, పాదచారులు గుంతలో పడే ప్రమాదముంది. ఇటీవల ఓ వ్యక్తి ఆ గుంతలో పడి గాయాల పాలయ్యాడు. మంగళవారం ఓ కారు మ్యాన్ హోల్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు కారును బయటకు లాగారు. మ్యాన్ హోల్‌కు పైకప్పు ఏర్పాటు చేయకపోతే ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పురపాలక శాఖ అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌కు పైకప్పు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పాత బస్టాండ్ కూడలిలో పైకప్పులేని మ్యాన్ హోల్

మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని గ్రాట్యుటీ వర్తించదంటూ రాష్ట్ర మునిసిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆప్కాస్ అనే సంస్థ ప్రభుత్వ అధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కోసం ఏర్పాటు చేసినట్లు సాంకేతిక కారణాలను సాకుగా చూపి చట్టబద్ధంగా అమలు కావాల్సిన గ్రాట్యుటీ పథకం నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులైతే గ్రాట్యుటీ వర్తిస్తుందనే అర్థంలో ప్రభుత్వం చెప్పడం అవివేకంతో కూడుకున్నట్లు చర్య అన్నారు. యజమాని, కార్మికుడు సంబంధం ఉన్న ప్రతి సంస్థలోనూ ఉద్యోగులు, కార్మికులు ఎవరైనా గ్రాట్యుటీ వర్తిస్తుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు బీవీ రమణ,చెన్నయ్య రాంబాబు మాట్లాడుతూ బిపిఎల్‌ఫ్‌లోని 8 నెలల పెండింగ్ పిఎఫ బకాయిలు ఇవ్వాలని, డ్రైవర్లకు 36 జిఒలను చేసి రూ. 24500 వేతనం ఇవ్వాలన్నారు. ఆప్కాస్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కాదని ఇప్పుడు చెప్తున్న ప్రభుత్వం గత నాలుగేళ్లుగా 60 ఏళ్ల నిండిన వారిని ఉద్యోగాల నుండి బలవంతంగా విరమణ చేయించారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆప్కాస్ ప్రారంభించినా ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా ఆ ప్రభుత్వ అడుగుల్లోనే అడుగులు వేస్తూ గత 9 నెలలలో వందలాది మందిని 60 ఏళ్ల నిండాయని సాకుతో ఉద్యోగాల నుంచి బలవంతంగా రిటైర్మెంట్ చేయిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పద్ధతుల్లో జారీ చేసిన సర్క్యులర్ ను వెంటనే ఉపసంహరించి మునిసిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులందరికీ గత 17 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన ఒప్పందం మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్‌తో కూడిన విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేయాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

అభియాన్‌ను పక్కాగా అమలు చేయాలి

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

ధార్తి ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పక్కాగా అమలు అయ్యేలా చూడాలని జెసి ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ధార్తి ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, హౌసింగ్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ సమావేశాన్ని ప్రారంభిస్తూ జిల్లాలో నాలుగు మండలాలలోని 17 గ్రామాలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. గ్రామాలలో 50 శాతం పైబడి జనాభా గిరిజనులు ఉన్నట్లుగా జెసికి వివరించారు. ఈ గ్రామాలలో వివిధ శాఖల సమన్వయంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో పక్కా ఇళ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్, ఇంటింటికి విద్యుత్, సోలార్ ప్యానెల్ నిర్మాణం, జాతీయ హెల్త్ మిషన్, ఉజ్వల యోజన, పోషణ్ అభియాన్, సమగ్రశిక్ష, తదితర పథకాలను అమలు చేయబోతున్నామని పేర్కొన్నారు. అనంతరం జెసి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు 50 శాతం పైగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ, మండల స్థాయి కమిటీలు ఎప్పటి కప్పుడు ఈ కార్యక్రమాలను సమీక్ష సమావేశాలను నిర్వహించుకొని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. కొన్ని గ్రామాలలో కొంతమంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు అవ్వని పక్షంలో వారందరికీ సహాయ సహకారాలు అందించి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వారికి అందజేయాలన్నారు. అటవీ ప్రాంతం ఉన్న గ్రామాలలో అటవీ హక్కుల చట్టాలను అమలు చేసి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే కార్డులు అందని వారికి అందేలా చేయాల న్నారు. కిసాన్ సమాన్ నిధి పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిమాపక శాఖాధికారి శివప్ప

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మదన పల్లె అగ్నిమాపకశాఖ అధికారి జి.శివప్ప పేర్కొ న్నారు. అగ్నిమాపక వారోత్స వాలలో భాగంగా మంగళవారం మదనపల్లె ఫైర్ స్టేషన్ నుండి చిత్తూరు బస్టాండ్ సర్కిల్, నిమ్మనపల్లి సర్కిల్, ఎన్.వి.ఆర్ లేఅవుట్, మోతీ నగర్ వరకు కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్ప మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్స వాలను ఈ నెల 20వ తేదీ వరకు నిర్వ హించి అగ్ని ప్రమాదాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకొ స్తామన్నారు. స్థానిక మోతీనగర్ నందు శివసాయి అపార్ట్‌మెంట్‌లో నివాస ముంటున్న ప్రజలకు అగ్నిమాపక నివారణ కిటుకులను తెలియజేశారు. ఎల్‌పిజి సిలిండర్ల ప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్, వంట నూనెల ప్రమాదం, స్మోక్ ఎగ్జాస్ట్, సేఫ్టీ ఎస్కేప్ గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల వలన ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా 101, 08577222101లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమా దాలని నివారించడానికి అగ్నిమాపక శాఖ సిబ్బంది సిద్ధంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారి శివప్ప

బాల్య వివాహాలను అరికట్టండి

ప్రజాశక్తి-పీలేరు : మండల పరిధిలోని మసీదుల్లో జరుగుతున్న బాల్య వివాహాలను అరిక ట్టాలని పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావును ప్రభుత్వ మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి ఖాజీగా విధులు నిర్వహిస్తున్న కె.ఎస్. నవాజుద్దీన్ కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని మసీదులలో నిర్వాహకులు వివాహాలు చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారన్నారు. సక్రమమైన ధ్రువపత్రాలు లేకుండా వధూవరులకు వివాహాలు జరపడం వారి భవిష్యత్తుకు అంత మంచిది కాదన్నారు. గుట్టు చప్పుడు కాకుండా అలా వివాహాలు జరిపించడంవలన వధూ వరుల జీవితాలతో చెలగాటమాడుతూ వారి కుటుంబాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. నిర్ణీత రుసుం కన్నా ఎక్కువగా తమ ఇష్టారాజ్యంగా వధూవరుల నుండి వసూలు చేసుకుని సొంత రసీదు పుస్తకాలతో విచ్చలవిడిగా వివాహాలు జరిపించడంపై ఆవేదన చెందారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన ఐసిడిఎస్ శాఖ వారు కూడా మసీదుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై తగిన ఆదేశాలను తమ సిబ్బంది ద్వారా మసీదు నిర్వాహకులకు తెలియజేస్తామని తహశీల్దారు సానుకూలంగా స్పందిం చారు. ప్రభుత్వ అనుమతులతో మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి నియమించబడిన ఖాజీల ద్వారా ముస్లింలు అధికారికంగా వివాహాలు జరిపించుకోవచ్చన్నారు. ముస్లీం కుటుంబాల వారు వివాహాలు జరిపించుకోడానికి తమను సంప్రదించాలని కోరారు. ఎవరైనా మసీదులలో ధర్మకర్తగా ఉండి వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన 'చమర్తి'

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : పాత బస్టాండ్ సమీపం లోని స్వాగత్ రెస్టారెంట్‌ను నిర్వాహకుడు గణేష్ కుమార్ రాజు ఆహ్వానం మేరకు మంగళ వారం టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మో హన్‌రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హోటల్ యాజమాన్యం ప్రజలకు రుచికరమైన భోజనం అందించాలని, శు భ్రత, నాణ్యత పాటించాలని సూచించారు. వినియోగదారుల ప్రశంసలు ఉంది వ్యాపార అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నేనాయుడు, మాజీ మండలాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-వాల్మీకిపురం: ఒక్కటిన్నర నెల సమయం ఇచ్చాం.. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణలను తొలగిస్తున్నామని వాల్మీకిపురం పంచాయతీ ఇఒ వీరబల్లి రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో కాలువపై నిర్మించిన ఆక్రమ నిర్మాణాలను జెసిబితో తొలగించారు. పంచాయతీ కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న నేపథ్యంలో దుఖాణదారులు 24గంటలు సమయం ఇస్తే తామే స్వచ్ఛందంగా తొలగిస్తామని చెప్పడంతో తొలగింపు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబితో తొలగిస్తున్న ఆక్రమణలు

మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- ఈగల్ టీం సమావేశంలో ఎస్‌పి వెంకటాద్రి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అదనపు ఎస్‌పి (పరిపాలన) ఎం.వెంకటాద్రి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఈగల్ టీం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించిన వ్యూహాలు, ప్రణాళికలు, అమలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ బృందం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం, విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించడం, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వేగవంతం చేయడం, వివిధ కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ 1972 ద్వారా సమాచారం సేకరించడం, మాదకద్రవ్యాల బారిన పడిన వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈగల్ టీం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. డాక్టర్ రసీదు లేకుండా మెడికల్ స్టోర్‌కి వస్తే మందులు ఇవ్వొద్దని చెప్పారు. అలా ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులలో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోసం ఒక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. మాదకద్రవ్యాల సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించాలన్నారు. మాదకద్రవ్యాల విషయంలో ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో డిఇఒ కె.సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఒ జి.ఉషాశ్రీ, రాయచోటి జైల్స్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి.కృష్ణకిషోర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జయరాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి ఎస్.మస్తాన్ వలీ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.తులసిరామ్, సైబర్ సెల్ ఎస్ఐ చిరంజీవి, ఈగల్ సెల్ నెంబర్ ఎస్.ప్రతాప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వెంకటాద్రి

గాలివానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

గాలివానతో నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో గాలివాన ప్రభావంతో నష్టపోయిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం కురిసిన అకాల గాలివాన దెబ్బకు దశాబ్దాల మామిడి చెట్లు నేలకొరిగాయని తెలిపారు. టన్నులలో మామిడికాయలు రాలిపోయాయని చెప్పారు. రైతుకు అపార నష్టాన్ని కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు సక్రమంగా కురువక రైతాంగం మామిడి తోటలను బిడ్డలను పెంచుకున్నట్లు పెంచుకున్నారని అలాంటి చెట్లు వేర్లతో సహా నేలకు ఒరిగి పోయిన మామిడి చెట్లనుచూసి రైతులు బిడ్డలను పోగొట్టుకున్న తల్లిదండ్రుల రోధిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బోర్ల కింద సాగుచేసిన పొద్దుతిరుగుడు, వరి పంటలు నేలమట్టం అయ్యాయని తెలిపారు. మండలంలోని వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. రైతులకు సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల బీమా అన్నదాత సుఖీభవ వెంటనే మంజూరు చేసి రైతులకు ఖాతాలో జమ చేసి నష్టపోయిన రైతులు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు షబ్బీర్‌బాషా, శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, కిరణ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్, మదన, యువరాజు, రైతులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్, ఎంఎస్‌సి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పరీక్షలు మంగళవారం విశ్వవిద్యాలయ ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనం లో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. పలువురి విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. నిర్వహణలో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షలు సూపరింటెండెంట్ ఆచార్య కాత్యా యని మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో 543 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లుగా డాక్టర్ ప్రమీల మార్గరేట్, డాక్టర్ రాఘవేంద్ర కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ బాధ్యతల్లో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ గురించి తెలుసుకుంటున్న పద్మ

వైవీయూలో ప్రపంచ కళా వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

లలిత కల విభాగంలో ప్రముఖ చిత్రకారుడు 'లియోనార్డ్ డావిన్సీ' 574వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీ డీన్ ఆచార్య కె.గంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ లియోనార్డ్ డావిన్సీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని చిత్రకళా రంగంలో ఉన్న అత్యద్భుతమైన పటిమ కారణంగా శాస్త్రవేత్త గాను, గణిత శాస్త్రవేత్తగాను, ఇంజినీర్ గాను, శిల్పకారుడు, వృక్షశా స్త్రజ్ఞుడు, సంగీతకారుడుగా రాణించారని పేర్కొన్నారు. సాంకేతిక అభివృద్ధిలో భాగమైన ఎన్నో విషయాలను లియోనార్డో శతాబ్దాలు ముందే తన స్కెచ్ లో శాస్త్రీయంగా శోధన చేసి పొందుపరిచారని చెప్పారు. డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ చిత్రాలు ఈనాటికి ప్రజల మనసులో చిరస్థాయిగా మిగిలిపోయాయని, దాని కారణం అతను చూపిన అసమాన ప్రతిభ కొలమానమని పేర్కొన్నారు. ప్రతి చిత్రకళా విద్యార్థి లియోనార్డో చిత్రాలను పరిశీలించి ప్రేరణగా తీసుకోగలిగితే భవిష్యత్తులో మంచి స్థాయిలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథి, విభాగాధిపతి, అధ్యాపకులు అందరూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు విద్యార్థులు డావిన్సీ గురించి మాట్లాడారు. తర్వాత లియోనార్డో డావిన్సీకి సంబంధించి డాక్యుమెంటరీ చిత్రాన్ని డిపార్ట్‌మెంట్‌లలో ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, బి.చినరాయుడు, బి.వీరప్ప, ఎం.వాసవి, చంటి సూరి, డాక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వి.సుధాకర్, ఆఫీస్ సిబ్బంది లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రసిద్ధ రంగస్థల కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరిం చుకుని ఈనెల 16 నిర్వహించే తెలుగు నాటక రంగ దినోత్సవ సంద ర్భంగా జిల్లాకు చెందిన ప్రసిద్ధ రంగస్థల కళాకారులను సన్మానించినట్లు రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం పెన్షనర్స్ కార్యాలయంలో కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2500 నాటకాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి జిల్లాకే తలమానికంగా నిలిచి ఎన్నో అవా ర్డులు సాధించిన ఎస్.మధుబాబు, 10 సంవత్సరాల వయస్సులో నాటక రంగం ప్రవేశించి నటిగా తన నటనా వైభవంతో నంది, గరుడ, కళా రత్న మొదలైన సత్కారాలు అందుకున్న అరుణకుమారి, నాటక రంగమే శ్వాసగా జీవిస్తూ భిన్నమైన ఎన్నో పాత్రలను ధరించి జీవం పోస్తున్న దాసరి సుధాకర్, కవిగానే కాకుండా రంగస్థల కళాకారునిగా తనకొక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారునిగా, కళా పోషకునిగా నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న పి.మల్లయ్యలను సంస్థ ద్వారా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నాగేష్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మేకల సుబ్బరాయుడు, రాయుడు, బాబయ్య, బాలయ్య, లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, విజయకుమార్, గంగాధర్, నాగయ్య పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-పెనగలూరు (రాజంపేట అర్బన్)

మండలంలోని కొండూరు పంచాయతీ వెంగమాపురం గ్రామం ప్రజలకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు మంగళ వారం పెనగలూరు తహశీల్దార్ అమరేశ్వరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ పెద్దల కాలం నుండి ఒకచోట గాజు, పూస, దహన సంస్కరణలకు స్థలం వినియోగించుకుంటుండగా కొంతమంది ఆక్రమణకు పాల్పడ్డారని పేర్కొన్నారు. తహశీల్దారు వెంటనే స్పందించి సర్వే నిర్వహించి స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. వెంగమాంబపురం రెవిన్యూ పరిధిలో ఎక్కడా కూడా డికెటి స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉన్న భూమి అన్యాక్రాంతం అవడం ద్వారా స్మశాన వాటిక దహన సంస్కరణలకు ఎక్కడ కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ స్తులు ఆవేదన చెందారు. పెద్దల కాలం నుండి ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కూడా కొంతమంది ఆక్రమణ గురి చేస్తున్నారని తహసిల్దారుకు మొరపెట్టు కున్నారు. సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ సమస్యను వెంటనే పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మలిశెట్టి నారాయణ, మహేష్, నరసింహ, సుబ్బరాయుడు, సుబ్బ నరసయ్య, రామయ్య, హరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిస్సార్ అహమ్మద్

ముస్లింలకు అండగా జగన్ : వైసిపి

ప్రజాశక్తిజి-మదనపల్లె అర్బన్

ముస్లింల మనోభావాలను గుర్తించి వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతి రేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం శుభ పరిణామమని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్నా వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అమలును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లింల కోసం మాజీ సిఎం జగన్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ముస్లింలను దెబ్బతీయాలనే కుట్రతోనే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్ బి.ఎ.ఖాజా, నాయకులు రఫిక్ అహ్మద్, సలీం పాల్గొన్నారు.

మతాల మధ్య బిజెపి చిచ్చు : కాంగ్రెస్

రాజకీయ లబ్ధి కోసమే బిజెపి మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాష అన్నారు. మంగళ వారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందు, ముస్లిం, క్రిస్టియన్లు అన్నదమ్ముల్లా కలసి ఉంటేనే దేశ పురోగాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దేశంలోని హిందు, ముస్లింల మధ్య ఉన్న మతసామరస్యాన్ని దెబ్బ తీయడం కోసమే వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు వారి భవిష్యత్తు కోసం హిందూ, ముస్లింల మధ్య వివాదాలకు ఆజ్యం పోస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రజల మధ్య సోదర భావం, మతసామరస్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేయాలని కోరారు.

మైనార్టీ గురుకులం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఇంటర్మీడియట్ మొద టి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పట్టణంలోని తరి గొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల జూని యర్ కళాశాల విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమా మంజుల తెలిపారు. రెండవ సంవత్సరం ఎంపిసిలో షాను 933, బైపిసిలో సైదాబాను 961, సిఇసిలో అర్షియా షబ్రీన్ 865 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో అఫీషా 410, బైపిసిలో సనా 400, సిఇసిలో మిను 442 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రెసిడెంట్, సంఘం సభ్యులు

20న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-ములకలచెరువు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ పారంపర్య వైద్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య అవగాహన చికిత్స శిబిరం ఈ నెల20న ములకలచెరువులోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సంఘసభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సంఘం అధ్యక్షులు ఎన్ఎస్.ఎండి. ముక్తియార్, వైస్ ప్రెసిడెంట్ షరీపుద్దీన్, సంఘం సభ్యులు వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు ఇంటిలో సాధారణంగా వాడే వంట ఔషధాల ద్వారా ఆరోగ్య సంరక్షణ గురించిన అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆరోగ్య సమస్యలపై ఉచిత వైద్య పరీక్షలు, సలహాలు అందిస్తారని చెప్పారు. స్త్రీలకు ప్రత్యేకంగా స్త్రీ వైద్యులు కూడా అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎపి స్టేట్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి.భాను ప్రకాష్, ప్రముఖ వైద్యులు హాజరవుతారని అన్నారు. మండల ప్రజలతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ట్రెజరర్ రౌషన్ జమీర్, సుభహాన్, సాదిక్, నారాయణస్వామి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి తిరుపతి సౌజన్యంతో షాదీమహల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెన్షనర్ పితామహుడు దివంగత నకార చిత్రపటానికి స్థానిక సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ వై ఆదినారాయ రెడ్డి, డాక్టర్ వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ శిబిరం సమన్వ యకర్త స్టేట్ సంఘం కార్యదర్శి సి.సురేంద్రరెడ్డి, జయరాం, మస్తాన్‌ఖాన్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ పెన్షనర్స్ సంఘం గత నాలుగైదు సంవత్సరాలుగా నిస్వార్థ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వృద్ధాప్యంలో కన్న బిడ్డల నిరాదరణకు నోచుకోని తల్లిదండ్రుల సేవలకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు. కంటి పరీక్షలకు 105 మంది హాజరు కాగా వారిలో 60 మంది ఆపరేషన్‌కు ఎన్నిక య్యారని తెలిపారు. ఆప్తమాలజిస్ట్ బి.నాగార్జున, ఎ.వాణి, విష్ణు వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు ఎన్.కృష్ణారెడ్డి, నారాయణమూర్తి, కాంతమ్మ, నారాయణరెడ్డి, సరోజమ్మ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల మంజూరులో..

కూటమి నాయకుల పెత్తనం

- బ్యాంకు అధికారులపై ఒత్తిడి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కార్పొరేషన్ రుణాల మంజూరులో మా మాటే శాసనమని కూటమి నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. బిసి, కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాల విషయంలో బ్యాంక్ మేనేజర్లని కూటమి నాయకులు ఇబ్బందులు గురిచే స్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలైన లబ్ధిదారులకు కాకుండా సిబిల్ స్కోర్ లేని వారికి రుణాలు మంజూరు చేయలేమని బ్యాంకు మేనేజర్ తేల్చి చెబుతున్నారు. తాము అధికారం పక్షం నాయకులమని రుణాలు ఇచ్చి తీరాలని ఇబ్బందులు పెడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలో అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారులు, బ్యాంకు మేనేజర్లు బహిరంగంగానే మాట్లాడు కుంటున్నారు. అధికారులపై పెత్తనం చేస్తూ అర్హులైన వారికి రావాల్సిన సబ్సిడీ రుణాలను వారికి అనుకూలమైన వారికి సిబిల్ స్కోర్ లేకున్నా బ్యాంకు మేంజర్లపై ఒత్తిడి చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. పేరుకు మాది ప్రజా ప్రభుత్వమని కూటమి నాయకులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు పరిస్థితి పూర్తిగా అందంగా ఉందని ప్రజలు చెబుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న చంద్రశేఖర్, మాలమహానాడు నాయకులు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే అణగారిన వర్గాలు చైతన్యం కలిగి అభివృద్ధితో పాటు సమానత్వం, సమ సమాజ స్థాపన జరుగుతుందని భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారని టిసి సంఘం నాయకులు మాదారపు చంద్రశేఖర్, మాల మహానాడు నాయకులు రాజశేఖర్ కొనియాడారు. మంగళవారం పాత కళాశాల మైదానంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పారిశ్రామికవేత్త మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుకొండ మద్దిరెడ్డి ఆర్థిక సహకారంతో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలల్లోని విద్యార్థులకు పలకలు, బలపాలు, పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసి చైర్మన్ శివ పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికావొద్దు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శాంతకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లో విద్యార్థులకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధులు గురించి ఆయన అవగాహన కల్పించారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్ గన్యా, బోదకాలు తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు శిరీష, జ్యోతి, ప్రిన్సిపల్, పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, కంభంవారిపల్లి పోస్టు & మండలం, తూర్పు హరిజనవాడ గ్రామానికి చెందిన ఊటుపల్లి చెంగ్రాయుడు కుమారుడు ఊటుపల్లి కిరణ్ కుమార్ అనే నేను 2025 ఏప్రిల్ 14వ తేదీన ఆర్టీసీ బస్సులో కె.వి. పల్లి నుంచి పీలేరుకు వస్తుండగా మార్గం మధ్యలోని మిన్నంరెడ్డిగారిపల్లి వద్దకు బస్సు చేరుకునేసరికి, ప్రయాణికులు ఎక్కువై నా చేతి సంచిలోని **C2789179** నెంబరు గల నా ఒరిజినల్ పాస్పోర్టు కవరు దారిపోయింది. బస్సులో కండక్టర్ ప్రయాణికులను విచారించినా ఫలితం లేకుండా పోయింది. పాస్పోర్ట్ దొరికిన వారు 6281034045 సెల్ నెంబర్‌కు సమాచారం అందించి సహకరించాలని కోరడమైంది.

రైతులను నిలువునా ముంచిన దోస పంట

- అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు
- ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకోలు

పొలంలోనే వదిలేసిన దోస పంట

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కోటి ఆశలతో సాగుచేసిన దోస పంట రైతన్నలను నిలువనా ముంచింది.కనీస ధర లభించకపోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.వివరాల్లోకి వెళితే బి.కొత్తకోట నగర పంచాయతీ సమీపంలోని శెట్టిపల్లి గ్రామ సర్వేనెంబర్ 105-ఆర్‌లో ఐదు ఎకరాలలో గుంతూరు వెంకటరెడ్డి అనే రైతు దోసపంట సాగుచేశారు. పంట బాగా వచ్చినప్పటి ధరలు లేకపోవడంతో రూ.11 లక్షల వరకు నష్టం వాటిల్లింది.కేజీ దోస ధర రూ.5, రూ.6 మాత్రమే పలుకుతోంది.దీంతో రైతే టాటా ఎస్ వాహనంలో అమ్ముకుంటూ కొంతైనా ఆదాయం పొందేందుకు కష్టపడుతున్నాడు. రూ.11 లక్షలు పెట్టుబడి పెడితే కనీసం కూలీ ఖర్చులు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది.లక్షలాది రూపాయలు వెచ్చించి, ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేస్తే కనీసం పెట్టుబడి, చేసిన కష్టం చేతికి తీవ్రఅవస్థలు పడు తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు దోస పంట వేసిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తు న్నారు.

ఆటోలో దోసకాయలను అమ్ముకుంటున్న రైతు వెంకటరెడ్డి

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన 'సుంకు ఉషా గౌతమి' విద్యార్థులు

కావ్య,ఎంపిసి | షిఫెఅంజుమ్(బైపిసి) | మహమ్మద్(బైపిసి) | నందు ప్రియ(సిఇసి)

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇంటర్ ఫలితాలలో బి.కొత్తకోట పట్టణంలో సుంకు ఉషా గౌతమి మెమోరియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో నియోజకవర్గంలో అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిల 1000 మార్కులకుగాను ఎస్.గ్నేయ 985, కె.అమృత 982, బి.కావ్య 979, ఎస్.రాధిక 977 మార్కులు సాధించారని తెలిపారు. బైపిసిలో 1000 మార్కులకుగాను బి.షిఫా అంజూమ్ 976, ఎల్ఎండి ఆషిక్ 966, కె.రిషితారాణి 962 మార్కులు వచ్చాయని తెలిపారు. సిఇసిలో1000 మార్కులకుగాను పి.నందుప్రియ 962, డి.తరణి 947 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో 470 మార్కులకుగాను ఎస్.సంధ్య 465, బి.అశ్విని 460 మార్కులు, బైపిసిలో 440 మార్కులకుగాను టి.మిస్బా 425, పి.మోక్షిత 420 మార్కులు, సిఇసిలో 500 మార్కులకుగాను సి.ముబషీరా 460, వై.వర్ష 447 మార్కులు సాధించి సత్తాచాటారన్నారు. తమ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇంతటి గొప్ప ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులు సహకరించిన వారి తల్లిదండ్రులకు కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు.

అవగాహనతోనే సికిల్ సెల్ అనీమియా నివారణ

ప్రజాశక్తి-కలికిరి

అవగాహనతోనే సికిల్ సెల్ అనీమియా నివారణ సాధ్యమని డాక్టర్ కావ్యగంధ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని ఎస్‌టి కాలనీ లో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన ప్రజలకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ సికిల్ సెల్ అనీమియా పై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ వ్యాధి వారస్వతంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి అని, ఈ జబ్బు తల్లిదండ్రుల నుంచి జన్యుపరంగా పిల్లలకు వస్తుందని అన్నారు. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగు లోకి మారడం, తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడం లో కష్టం, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భ ధారణ సమయం లో సమస్యలు, అవయవ వైఫల్యం, పెరుగుదల సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ వ్యాధి నిర్ధారణ కొరకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త దగ్గర పరీక్ష కిట్స్ అందుబాటులో ఉన్నాయని ఒక్క చుక్క రక్తం తో పరీక్ష చేసుకోవచ్చునని, సున్నా నుండి 40సంవత్సరాల లోపు గిరిజనులు పరీక్షలు చేసుకోవాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే హైడ్రాక్సీ యూరియా మాత్రలుతో పాటు ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అవసరం ఐతే రక్తం ఎక్కించాలిసి వస్తుందని, వ్యాధి స్థాయిని బట్టి ఎముక మజ్జ మార్చబడుతుదని అన్నారు. అనంతరం డెంగీ, మలేరియా, టిబి, వడదెబ్బ, కుష్టు వ్యాధుల గురిం చి కూడా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌష్టికాహారం పై కూడా అవగాహన కల్పించి ప్రజల చేత నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సైరాబాను, ఎఎన్ఎం రమా దేవి, ఆశా కార్యకర్తలు అరుణ, ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త తిరుమల, 104సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అభివృద్ధే తన అజెండా అని అదే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యం కూడా అని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలో ఆయన పర్యటించారు. మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఎదుగుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం వారికి టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి, వారికి కుట్టు మిషన్లను కూడా అందిస్తోందని అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా అనేక విధాలుగా రుణాలను మంజూరు చేస్తూ వారి కుటుంబంలో ప్రభుత్వం వెలుగులు నింపుతుందని అన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత మండలంలో 25 సార్లకు పైగా పర్యటించానని, స్వయంగా అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే వంద కోట్లకు పైగా మండలంలో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో వంద కోట్లకు పైగా త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడు తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు బలం గా ఉంటాయని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తన వద్దకు ఎప్పు డైనా రావచ్చు అని, ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత నాదని భరోసా కల్పించారు. భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రి చంద్ర బాబుకు, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ పర మేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ అమర్నాథ్, ఏపిఎం మురళి, ఎపిఓ రమేష్, ఎంఇ ఒలు నారాయణ, పద్మావతి, నాయకులు పుర్రా వెంకట రమణ, ఆర్‌జె. వెంకటేష్, రాజన్న, రెడ్డప్పరెడ్డి, శ్రీపతి, సర్పంచ్ మధు, పాపులమ్మ మల్లప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాలాడి ప్రభాకర్‌రెడ్డి

ఆర్ఆర్‌ను విమర్శిస్తే సహించం : వైసిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డిను విమర్శిస్తే సహించమని వైసిపి నాయకులు కాలాడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్ఆర్ నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాయచోటి ఎన్‌హెచ్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం డంపింగ్ చేసిన కంకరను దొంగలించారని రెడ్ హ్యాండెడ్‌గా టిప్పర్, జెసిపిలను పోలీసులకు పట్టించినా చర్యలు తీసుకోకుండా ఆర్ఆర్ కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడి తిరిగి వైసిపి నాయకులనే విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆర్ఆర్, రాజగోపాల్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా మచ్చలేని నాయకులుగా పని చేశారని అన్నారు. వెలిగల్లు , చిన్న పోతులపల్లి డ్యాం నిర్మాణాలకు కృషి చేశారని అన్నారు. ప్రజా సంక్షేమమే కోసం ఆర్ఆర్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఏనాడు అవినీతి అక్రమాలకు పాల్పడ లేదని అన్నారు. ఓ నాయకుడు ఆర్ఆర్ కుటుం బంపై విమర్శలు చేస్తున్నారని, ఆయన బి.ఎర్రగుడి కస్పా, నల్ల గుట్టపల్లి సిమెంట్ రోడ్డును రద్దు చేయించి తన ఇంటి ముందు వేయించుకున్నాడని అన్నారు. రైతులకు ఇవ్వవలసిన మినీ గోకులం తన ఇంటి ముందు నిర్మిం చుకున్నాడని, అలాంటి వ్యక్తి ఆర్ఆర్ కుటుంబంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అంబా బత్తిన రెడ్డయ్య, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మాజీ ఎంపిటిసి చంద్రాయుడు, ఉప సర్పంచ్ రాజారెడ్డి, కో-ఆప్షన్ నెంబర్ సయ్యద్ అమీర్, మాజీ సర్పంచ్ మోటిపల్లి రెడ్డన్న, సిద్ధక జయ చంద్రారెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజాదరణ ఓర్వలేకే మంత్రిపై ఆరోపణలు : టిడిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి నాయకులు మంత్రి కుటుంబ సభ్యులపై అసత్యరోపణలు చేస్తున్నారని మండల టిడిపి నాయకులు యనుముల మదనమోహన్ పేర్కొన్నారు.మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కుటుం బంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని పేర్కొన్నారు. వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మా మంత్రి అవసరం లేదని మేమే సిద్ధంగా ఉన్నామని అన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి నుంచి 11 కోట్లు డబ్బులు తీసుకున్నావని వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని అన్నారుమా నాయకుడు 40 లక్షలు తీసుకున్నారని నువ్వు ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. మా నాయకుడి సమర్థత చూసి చంద్రబాబు టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల దాహర్తిని తీరుస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి వస్తున్న ప్రజాదరణను వైసిపి సహించలేక అసత్య ఆరోపణలను చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రి మండిపల్లి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎపిఐసిసి చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, ఆరీఫ్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షమ నాయక్, జయరాములు, సిద్ధక వెంకటరామిరెడ్డి, దేవానంద్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మదన్‌మోహన్

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి : పీడీ

ప్రజాశక్తి-కలకడ

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఉపాధి పనులలో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి హామీ ద్వారా చాలా వరకు జీవనం సాగిస్తునఆనరని వారి కోసం వారు అడిగిన చోట పనులు కల్పించి ప్రజలకు ఉపాధి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్ పనులను చేపట్టి రైతులకు మేలు కలిగించే విధంగా పనులు చేయించాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది సమయాపాలన పాటించి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు నిష్పక్షపాతంగా జరపాలని చెప్పారు. గతంలో జరిగిన ఉపాధి పనులను తిరిగి బిల్లులు తయారు చేయకుండా నూతనంగా పనులు చేయించి బిల్లులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. ఉపాధి పనులలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్య ధోరణితో ప్రవర్తించకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. బినామీల పేర్లతో ఎవరైనా ఉంటే ఉపాధి సిబ్బంది వెళ్లి పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి మధుబాబు, ఎపిఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

బాధిత రైతుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పులి దాడిలో పశువును కోల్పోయిన రైతుకు పరిహారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో గత సంవత్సరం అక్టోబర్ నెలలో జరిగిన పులి దాడి సంఘటనలో ఆవు దూడను కోల్పోయిన రైతుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం నష్టం పరిహారం చెక్కును అటవీశాఖ అధికారులతో కలసి పంపిణీ చేశారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ, చల్లావారిపల్లెకు చెందిన రైతు అదన్నకు చెందిన పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉండగా, చిరుత పులి ఓ పశువును ఈడ్చుకెళ్ళి చంపేసిందని తెలిపారు. ఈ ఘటనతో ఆ కుటుంబం అడవి జంతువు కారణంగా కుటుంబానికి ఆధారమైన పశువును కోల్పోయి ఇబ్బంది పడ్డారన్నారు. బాధిత రైతుకు పరిహారం చెల్లింపు కోసం అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. బాధిత రైతులను ఆదుకునే దిశలో ప్రభుత్వం పశు నష్టపరిహారం కింద మంజూరు చేసిన రూ.20 వేల నష్టపరిహారం చెక్కును బాధిత రైతు ఆదన్న కు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సబ్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఒ జయప్రసాద్, డిఆర్ఒ మదన్ మోహన్, ఎఫ్‌బిఒ దీప, రైతు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం, భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కుటుంబ సాధికార సారధుల సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదును పంచాయతీల వారీగా సమీక్షించారు. పార్టీ అభివృద్ధి కోసం, భవిష్యత్తు కోసం నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా ఉంటూ ముందుకు సాగాలని అన్నారు.పార్టీ కోసం కష్టపడే వారికి అధిష్టానం తగిన గుర్తింపును ఇస్తుందని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్ జె వెంకటేష్, రెడ్డప్పరెడ్డి, పుర్రా వెంకటరమణ, రాజన్న, మల్లికార్జున, మల్లప్ప, మధు, దేవేంద్ర రెడ్డి, శ్రీపతి, సుధాకర, రఫీ, నవీన్, మేష రామకృష్ణ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో మంగళవారం కలగోట్ల సిద్దయ్య (45) అనే వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలం, రంగసముద్రం, మహబూబ్‌నగర్‌వీధికి చెందిన సిద్దయ్య రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

అందుబాటులో ఉన్న న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలని మైదు కూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్ సూచిం చారు. చాపాడు మండల న్యాయ సేవ సమితి ఆధ్వ ర్యంలో మంగళవారం పుల్లారెడ్డి నగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లా డు తూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవ గాహన కలిగి, తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యా యం పొం దాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకు ప్రతి ఒక్కరికి చట్టాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శివరామ్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు శ్రీనువాసులు, కరిముల్లా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెలుగులోకి వీరగల్లు విగ్రహం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లి గ్రామంలో 16 శతాబ్దం కాలంనాటి వీరగల్లు వెలుగులోకి తెచ్చినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరగల్లు విగ్రహంలో వీరుడు కుడి చేతిలో కత్తి, ఎడమ చేతిలో సంగీత వాయిద్య పరికరాన్ని పట్టుకున్నట్లు ఉందన్నారు. విగ్రహం పైభాగంలో కొన్ని జంతువులు చిత్రీకరించబడ్డాయన్నారు. వీరుని కింది భాగంలో ఒక రేసు కుక్క చెక్కబడి ఉందన్నారు. గ్రామంపై ఏదేని దాడి జరిగినప్పుడు ఆ దాడిని ప్రతిఘటించి వీరమరణానికి గుర్తుగా ఈ వీరగల్లు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ వీరుడు శైవ భక్తుడు వీరమరణం పొందక ముందు తన ఎడమ చేతిలో ఉన్న సంగీత వాయిద్య పరికరాన్ని ఆడిస్తూ, శివుని గురించి ప్రార్థిస్తూ తన్మయత్వం చెంది నాట్యం చేస్తున్నట్లుగా వీరగల్లు ఆనాటి కాలంలో చెక్కబ డిందని రమేష్ వివరించారు. వీరగల్లు విగ్రహం గురించి శెట్టివారిపల్లె గ్రామ స్తులు కొప్పర్తి కిరణ్‌కుమార్ రెడ్డి, పార్థసారధిరెడ్డి తనకు సమాచారం అందిం చారన్నారు. గతంలో వర్షాభావ పరిస్థితుల్లో భూమిలో ఉన్న ఈ వీరగల్లు విగ్ర హాన్ని కొప్పర్తి బాలసుబ్బారెడ్డి అనే వ్యక్తి బయటకు తీసి పూజలు చేయడంతో వర్షాలు పడేవన్నారు. ఆ తర్వాత మళ్లీ దీన్ని భూమిలో పాతిపెట్టే వారని తెలి పారు. రహదారి మరమ్మతులు, రహదారి విస్తరణ పనులు పలుమార్లు జరుగు తుండడంతో బాల సుబ్బారెడ్డి ఈ విగ్రహాన్ని మళ్లీ బయటికి తీసి పెట్టారని రమేష్ వెల్లడించారు. విగ్రహం గురించి ప్రముఖ స్తపతి, వాస్తు శిల్ప కళావ చస్పతి ఈమని శివనాగిరెడ్డికి తెలపగా ఆయన ఇది 16వ శతాబ్దం కాలం నాటిదని స్పష్టం చేశారని రచయిత తెలిపారు.